
సాక్షి ఒడిశా

మంగళవారం । 4 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తుల కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,79,601లు, బంగారం 30 మిల్లీగ్రాములు, వెండి 1 గ్రాము వచ్చాయని అధికారులు తెలిపారు.



షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదం

పర్లాకిమిడి రాజవీధిలోని బరాటం షాపింగ్ మాల్‌లో ఆదివారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో రెడీమేడ్ దుస్తులు కాలి బూడిదయ్యాయి.

- 8లో



ఉచిత దంత వైద్య శిబిరం

కొరాపుట్ మున్సిపాలిటీ పరిధి గౌడగుడ గ్రామంలో ఉచిత దంత వైద్య చికిత్స శిబిరాన్ని మహర్షి విక్రమ్ వాకర్స్ క్లబ్ కొరాపుట్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

శాసనసభ రద్దుకు మంత్రి మండలి సిఫారసు

భువనేశ్వర్: వర్చువల్ మాధ్యమంలో సోమవారం చిట్టచివరి మంత్రి మండలి సమావేశం సోమవారం జరిగింది. రాష్ట్రంలో బిజూ జనతా దళ్ ప్రభుత్వం 5వ విడతకు విజయవంతంగా తెరపడింది. ఈ సమావేశంలో 16వ శాసన సభను రద్దు చేయాలని సిఫార్సు చేస్తూ తీర్మానించారు. మంగళవారం రాష్ట్రంలో జరిగిన లోక్‌సభ, శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఒకరోజు ముందు ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ భువనేశ్వర్‌లో వర్చువల్ మాధ్యమంలో మంత్రివర్గ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో శాసన సభ రద్దుకు సిఫారసు చేయడమే మంత్రివర్గ సమావేశంలో ప్రధాన శీర్షికగా పేర్కొన్నారు. బీజేడీ ప్రభుత్వ పదవీకాలం పూర్తయిన విషయాన్ని గవర్నర్‌కు తెలియజేయాలని, అసెంబ్లీ రద్దుకు సిఫారసు చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. ఎన్నికల ఫలితాల ప్రకటనకు ముందే ఈ లాంఛనాన్ని పూర్తి చేయడం ఆచారం. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత అసెంబ్లీని రద్దు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేస్తుంది. తదనంతరం మంత్రి మండలి సభ్యులు తమ రాజీనామా లేఖలను ముఖ్యమంత్రికి అందజేస్తారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అసెంబ్లీని రద్దు చేయాలని గవర్నర్‌కు సిఫార్సు చేస్తారు.

డీజీపీ కార్యాలయం ముట్టడి



ఆందోళన చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

భువనేశ్వర్: గత నెల 30వ తేదీన భారతీయ జనతా పార్టీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అభిలాష్ పండా, కొంతమంది యువమోర్చా కార్యకర్తలపై బీజేడీ నాయకులు ప్రాణాంతక దాడికి పాల్పడ్డారు. భద్రక్ జిల్లా చాంద్‌బాలి నియోజకవర్గం ధనకుట పంచాయతీ కరంజమాల్ గ్రామంలో ఈ దాడి చేశారు. కానీ ఇప్పటి వరకు నిందితులపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికి నిరసనగా బీజేపీ యువ మోర్చా సోమవారం కటక్‌లోని డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించింది. ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో బీజేపీ యువమోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.


9 మంది బాధితులు డిశ్చార్జి

భువనేశ్వర్: గత నెల 29వ తేదీ సాయంత్రం పూరీ నరేంద్ర సరోవరం తీరంలో సంభవించిన బాణాసంచా పేలుడు ఘటనలో కాలిన గాయాలకు గురైన వ్యక్తులు క్రమంగా కోలుకుని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతున్నారు. శ్రీజగన్నాథుని చందన యాత్ర సందర్భంగా ఈ విషాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. సోమవారం పూరీలోని శ్రీజగన్నాథ్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ నుంచి ఒక బాధితుడు శ్రీధర్ రౌత్ (49) డిశ్చార్జ్ అయ్యాడు. దీంతో ఇప్పటివరకు మొత్తం తొమ్మిది మంది గాయపడిన వ్యక్తులు ఆస్పత్రుల నుండి డిశ్చార్జి అయినట్లు రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనరు ఎస్‌ఆర్‌సీ తెలిపారు. ప్రస్తుతం మరో 14 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య అంచెలంచెలుగా 13కి చేరిన విషయం తెలిసిందే.

వలస కార్మికుడి మృతి



గణేష్ మృతదేహం



గణేష్ (ఫైల్)

రాయగడ: ఉపాధి కోసం పొరుగు రాష్ట్రానికి వెళ్లిన ఒక యువకుడు ప్రమాదవశాత్తు ఎత్తు నుంచి కిందకు పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కల్యాణసింగుపూర్ సమితి సికరపాయి పంచాయతీలోని లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన గణేష్ హతిముండియా (25)గా గుర్తించారు. ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి తెలిసిన వివరాల మేరకు.. లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన గణేష్ ఆరు నెలల క్రితం పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఒక అపార్ట్‌మెంట్ నిర్మాణం పనుల్లో భాగంగా ఒక కాంట్రాక్టర్ వద్ద మేస్త్రీ పనికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఆదివారం అపార్ట్‌మెంటు పై అంతస్తులో పనులు చేస్తుండగా కాలు జారి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలం వద్దే ప్రాణాలు విడిచారు. సమాచారాన్ని కుటుంబీకులకు తెలియజేయగా విశాఖపట్నం వెళ్లి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంతిమ సంస్కారాలను పూర్తి చేశారు. అయితే బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జడ్జిమెంట్ డే



జయపురం: మాట్లాడుతున్న ఎన్నికల అధికారులు

- నేడే ఓట్ల లెక్కింపు
- ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం
- 69 స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు భద్రం

భువనేశ్వర్: రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల భవిష్యత్ మంగళవారం తేలనుంది. ఎన్నికలకు సంబంధించి వివిధ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ఉదయం 8.00 గంటల నుంచి ప్రారంభించేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సిద్ధమైంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రంలో 69 స్ట్రాంగ్ రూముల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం), వీవీ ప్యాట్లను కట్టుదిట్టంగా భద్రపరిచారు.

మూడంచెల భద్రత

స్ట్రాంగ్ రూముల చుట్టూ మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూములను సీసీ కెమెరాల నిఘాలో ఉంచారు. వాటి రక్షణ కోసం 25 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సీఏపీఎఫ్) మోహరించారు. పోలీసు బృందాలు రాత్రింబవళ్లు పహరా కాస్తున్నాయి. భువనేశ్వర్‌లోని బీజేబీ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉంచారు. సీఏపీఎఫ్ మరియు రాష్ట్ర సాయుధ పోలీసులు (ఓఎస్ఏపీ) ఇరువర్గాలు స్ట్రాంగ్‌రూమ్‌కు బాధ్యత వహిస్తారు. ఇదే తరహాలో బరిపద, బరంపురం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, ఉమా చరణ్ పట్నాయక్ ఇంజినీరింగ్ స్కూల్ ఆవరణలో స్ట్రాంగ్‌రూమ్‌లు ఏర్పాటు చేసి ఈవీఎం, వీవీప్యాట్‌లను కట్టుదిట్టమైన భద్రతలో ఉంచారు.

ఫలితాల తదనంతరంపై నిఘా

రాష్ట్రంలో ఫలితాల అనంతరం శాంతిభద్రతల పరిరక్షణపై భారత ఎన్నికల సంఘం ఉద్ఘాటించింది. ఎన్నికల తదనంతర పరిస్థితుల ప్రభావంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఈసీఐ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతోంది. ఈనెల 6 వరకు రాష్ట్రంలో 70కి పైగా సీఏపీఎఫ్ కంపెనీలు మోహరించబడతాయి. రాష్ట్రంలోని స్ట్రాంగ్‌రూమ్‌లు మరియు కౌంటింగ్ కేంద్రాలకు రక్షణగా 25 కంపెనీల సీఏపీఎఫ్ కొనసాగించాలని ఈసీఐ నిర్ణయించింది. రాష్ట్రం అంతటా శాంతిభద్రతల పరిస్థితిని నిర్వహించడానికి అదనంగా 70 సీఏపీఎఫ్ కంపెనీలను నియమించాలని నిర్ణయించారు.

లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

జయపురం: సార్వత్రిక ఎన్నికల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జయపురం సబ్ డివిజన్ ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ తెలిపారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ సభాగృహంలో విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. జయపురం విక్రమదేవ్ విశ్వ విద్యాలయంలో జయపురం, కోట్‌పాడ్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు 20 టేబుల్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. అలాగే బ్యాలెట్ పేపర్లు లెక్కించేందుకు 5 టేబుల్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. నవరంగపూర్, కొరాపుట్ లోక్‌సభ స్థానాల్లో అంతర్భాగమైన ఈ రెండు స్థానాల్లో లోక్‌సభ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. లోక్‌సభ ఓట్ల లెక్కింపు కోసం 58 మంది సిబ్బందిని, రెండు అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపునకు 37 మంది సిబ్బందిని నియమించామని తెలిపారు.

లెక్కింపు వివరాలు ప్రజలకు తెలిపేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో జయపురం బీడీవో శక్తి మహాపాత్రో, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్, జయపురం తహసీల్దార్ డా.మనోలిసి ఆచార్య, బొరిగుమ్మ బీడీవో అమృత లాల్ బెహర, కోట్‌పాడ్ అదనపు తహసీల్దార్ నీలాంబర పూజారి, జయపురం సబ్ డివిజన్ సమాచార ప్రజా సంబంధాల అధికారి యశోద గదబ, జయపురం పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొళాయి, సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి, బీజేడీ ప్రతినిధి సుభాష్ పండ, కాంగ్రెస్ ప్రతినిధి తరణి ప్రసాద్ పాణిగ్రహిలు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు

జయపురం:

సబ్ డివిజన్ కుంద్రా సమితిలోని వివిధ ప్రాంతాల్లో జయపురం ఎక్సైజ్ విభాగ సిబ్బంది సోమవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా 85 లీటర్ల నాటుసారా పట్టుకున్నారు. అలాగే మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. అరెస్టైనవారిలో ప్రధానిపుట్ గ్రామానికి చెందిన ధనబలిపుటియ, కుండిగుడ గ్రామానికి చెందిన డొంబు బిశాయి, ఉదిలిగుడ గ్రామానికి చెందిన లక్ష్మణ పొరజలు ఉన్నట్లు ఎక్సైజ్ విజిలెన్స్ విభాగ అధికారి రశ్మీరంజన్ నాయిక్ వెల్లడించారు. ఎక్సైజ్ కమిషనర్ నిరంజన్ భోల్, డిప్యూటీ కమిషనర్ డొంబుదొర ఖండ ఆదేశాల మేరకు జయపురం ఎక్సైజ్ విభాగ ఓపీసీ రశ్మీ రంజన్ నాయిక్ నేతృత్వంలో ఈ దాడులు నిర్వహించారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డి, కానిస్టేబుల్ వివేకానంద ఖేతి, పూజా నాయిక్ తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన నాటుసారా ప్యాకెట్లతో నిందితులు

శాసన సభ రద్దు

భువనేశ్వర్: రాష్ట్రంలో శాసనసభ రద్దు పురస్కరించుకుని గవర్నర్ రఘుబర దాస్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 174 క్లాజ్ (2)(బి) అధికార నిబంధనల మేరకు 2019 సంవత్సరం మే 25వ తేదీ నాటి నోటిఫికేషన్ నం.3038/ఓఆర్-ఎల్ఏ/2019 ప్రకారం ఏర్పాటు చేసిన రాష్ట్ర శాసన సభ రద్దుకు ఆదేశించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం ఆమోదంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అనుగుణంగా ప్రస్తుత శాసనసభ రద్దు అమలులోకి వస్తుంది.

మొయిలిగుడలో దారుణం

- మహిళపై మూకుమ్మడిగా దాడిచేసి హత్య
- ఏడుగురి అరెస్టు

రాయగడ:

ఒక మహిళపై మూకుమ్మడిగా దాడిచేసి హత్య చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీసుస్టేషన్ పరిధి మొయిలిగుడ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి టికిరి పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దుర్ఘటనలో మృతి చెందిన వ్యక్తి సుబేర్ నాయక్ భార్య ధీనమణి నాయక్‌గా గుర్తించారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 1వ తేదీన మొయిలిగుడలో నివాసముంటున్న సుబేర్ నాయక్ తన స్వంత పనిమీద టికిరి వెళ్లాడు. పనులు ముగించుకుని అదే రోజు రాత్రి 7 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. భర్త రాక కోసం ధీనమణి బయటే ఎదురు చూస్తూ కూర్చుంది. భర్త రావడంతో ఇంటి లోపలకు వెళ్లి తిరిగి బయటకు వచ్చిన ఆమెపై అదే గ్రామానికి చెందిన ధనమణి నాయక్, బాబినాయక్, ప్రేమ్ కుమార్ నాయక్, సోనాలి నాయక్, జీవన్ నాయక్, జుధిష్టిర్ నాయక్, బుజ్జి దేవ్ నాయక్‌లు దాడి చేశారు. పాత కక్షల కారణంగా ఆమెపై విచక్షణ రహితంగా దాడి చేయడంతో తీవ్రగాయాలతో కిందపడిపోయింది. ఇది చూసిన ఆమె భర్త వెంటనే టికిరి ఆస్పత్రికి చికిత్స కోసం తరలించాడు. అయితే అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో సుబేర్ నాయక్ టికిరి పోలీసుస్టేషన్‌లో దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేసి ఈ కేసుకు సంబంధించిన ఏడుగురిని ఆదివారం అరెస్టు చేశారు.



ఆస్పత్రిలో ధీనమణి నాయక్ మృతదేహం



ధీనమణి నాయక్ (ఫైల్)

విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి



రాయగడ: చికిత్స పొందుతున్న పురుషోత్తం మాఝి



జయపురం: రామ భూమియ మృతదేహం

జయపురం: సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితిలోని మీనాక్షి పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఒక కార్మికుడు విద్యుత్ షాక్‌తో సోమవారం దుర్మరణం చెందాడు. మరణించిన కార్మికుడు అవులాపడ గ్రామానికి చెందిన రామ భూమియ(35)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. మీనాక్షి పవర్ ప్రాజెక్ట్‌లో మరో మినీ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. ఈ ప్రాజెక్టు కోసం కొత్తగా నిర్మిస్తున్న భవనం పైకప్పుపై రామ భూమియ నీరు వేస్తున్నాడు. అయితే భవనం పైకప్పు మీదుగా విద్యుత్ లైన్ వైరు ఉంది. అతడు నీరు వేస్తున్న సమయంలో విద్యుత్ వైరు అతడికి తగలడంతో షాక్‌తో కింద పడ్డాడు. దీంతో అక్కడ పనిచేస్తున్నవారు వెంటనే అతడిని ప్రాజెక్టు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అతను అప్పటికే మరణించినట్లు డాక్టర్లు వెల్లడించారు. ఈ విషయం రామగిరి పోలీసు పంటి అధికారులకు తెలియజేయగా ఏఎస్ఐ బలరాం హికాక వచ్చి మృతదేహాన్ని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు చిన్నారులకు గాయాలు

రాయగడ: విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు చిన్నారులు విద్యుత్ షాక్‌తో గాయాలుపాలైన ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలోని బొడొమటికొన గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గాయాలైనవారిలో పురుషోత్తం మాఝి, పురంధర్ మాఝిలు ఉన్నట్లు గుర్తించారు. ఇద్దరూ ఆడుకుంటుండగా అక్కడే తెగిపడి ఉన్న విద్యుత్ తీగను వారు తాకడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయాలైనవారిని వెంటనే టికిరిలోని ఉషాపాడు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



రాయగడ: చికిత్స పొందుతున్న పలకా మాఝి

పిడుగుపడి 20 పశువులు మృతి

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి గుడారి సమితి కొదమ పంచాయతీలోని డెప్పాగా గ్రామంలో ఆదివారం రాత్రి పిడుగు పడటంతో 20 పశువులు మృతి చెందాయి. సాయంత్రం పచ్చిక మేసేందుకు సమీపంలోని అడవులకు వెళ్లిన ఆవులు, వర్షం కురవడంతో చెట్టుకిందకు అన్నీ చేరాయి. ఈ క్రమంలో పిడుగుపడడంతో మృతి చెందాయి. ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) నాయకుడు తిరుపతి గొమాంగో డిమాండ్ చేశారు. తహసీల్దార్ ఎ.స్నేహలత బాధితులను పరామర్శించి ప్రభుత్వం తరుపున నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



మృతి చెందిన పశువులు

పిడుగుపడి మహిళ మృతి

రాయగడ: పిడుగు పడి ఒక మహిళ మృతి చెందిన ఘటన సదరు సమితి మీరావళి పంచాయతీలోని గొడొవీధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతురాలు సీతేయి జిలకర (35)గా గుర్తించారు. ఈ విషయమై శేఖిల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం సీతేయి ఆదివారం సాయంత్రం అడవులకు పశువులను పచ్చిక మేపేందుకు తీసువెళ్లింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఒక చెట్టుకింద తలదాచుకుంది. అప్పుడు పిడుగు చెట్టుపై పడడంతో చెట్టు కింద ఉన్న సీతేయి తీవ్రగాయాలకు గురై మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు స్థానిక ఆస్పత్రికి తరలించినా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

వర్ష బీభత్సం



దోలాట్యాంకు రోడ్డులో చర్చి వద్ద పడిన చెట్లను తొలగిస్తున్న ఓడ్రాఫ్ సిబ్బంది

పర్లాకిమిడిలో ఆదివారం రాత్రి వర్ష బీభత్సం సృష్టించింది. గంటకు సుమారు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వచ్చిన ఈదురుగాలులతో కూడిన వర్షం అనేక చోట్ల విధ్వంసం సృష్టించింది. స్థానిక ప్రభుత్వ మెడికల్ క్రిటికల్ కేర్ యూనిట్ భవనంపై చెట్టు పడి భవనం పైకప్పు ధ్వంసమైంది. 50 పడకల ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆక్సిజన్ ప్లాంటుపై చెట్టు పడడంతో రేకుల షెడ్డులో ఉన్న రోగులను లోపలికి తరలించారు. ఆస్పత్రి రోడ్డులో ఉన్న కాథలిక్ రోమన్ చర్చి వద్ద ఉన్న పురాతన నాగమల్లి చెట్టు, ఎలక్ట్రికల్ పోల్ కూలడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లా ట్రెజరీ వద్ద టేకు చెట్టు ఒక ఇంటి మీద పడడంతో ఇంటి పైకప్పు ధ్వంసమైంది. ట్రెజరీ పక్కన పాత రెవెన్యూ భవనం పైకప్పు ఈదురుగాలులకు ఎగిరిపోయింది. ఓడ్రాఫ్ సిబ్బంది బరంపురం నుంచి సోమవారం విచ్చేసి పట్టణంలో నేలకొరిగిన చెట్లును, విద్యుత్ స్తంభాలను యంత్రాలతో తొలగించారు.

– పర్లాకిమిడి



ఆస్పత్రి రోడ్డులో చెట్టును నరుకుతున్న ఓడ్రాఫ్ సిబ్బంది



ఆస్పత్రి మార్చురీ వద్ద కూలిన చెట్టు



జిల్లా ట్రెజరీ రోడ్డులో ఇంటిపై పడిన టేకు చెట్టు



దోలా ట్యాంకు రోడ్డులో ఏటీఎం సెంటర్‌పై పడిన విద్యుత్ స్తంభం



ఎస్‌కేసీజీ కళాశాల ఆవరణలో పడిన చెట్లు



ప్రభుత్వ మెడికల్ రోడ్డులో విద్యుత్ స్తంభాలను సరిచేస్తున్న ఎలక్ట్రికల్ సిబ్బంది

క్లుప్తంగా

ఉచిత దంత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

జయపురం: కొరాపుట్ మున్సిపాలిటీ పరిధి గొడగుడ గ్రామంలో ఉచిత దంత వైద్య చికిత్స శిబిరాన్ని మహర్షి విక్రమ్ వాకర్స్ క్లబ్ కొరాపుట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. దంత వైద్యుడు డాక్టర్ నందన సింగ్ పరీక్షలు జరిపి తగిన సలహాలు ఇచ్చారు. వాకర్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు జగన్‌మోహన్ సాహు శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ శిబిరంలో వందలాదిమంది గ్రామీణులు దంత పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో మహర్షి విక్రమ్ వాకర్స్ క్లబ్ కొరాపుట్ అధ్యక్షుడు అజిత్ పాత్రో, కార్యదర్శి లలిత మోహన్ పట్నాయక్, కోశాధికారి సరోజ్ రథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ దుర్మరణం

ఎచ్చెర్ల: లావేరు మండలం సుభద్రాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా గరివిడి మండలం శివరాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గవిడి కృష్ణారావు(62) దుర్మరణం చెందారు. ఈయన ద్విచక్ర వాహనంతో వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. కృష్ణారావు మృతదేహం గుర్తు పట్టలేనంతగా నుజ్జునుజ్జు అయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతుడు కృష్ణారావు వైఎస్సార్‌సీపీ నాయకుడు. ఈయన కుమారుడు గవిడి శ్రీధర్ ప్రస్తుతం శివరాం సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు.

కొత్తమ్మతల్లి హుండీ ఆదాయం లెక్కింపు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం సోమవారం దేవదాయ శాఖాధికారులు చేపట్టారు. 71 రోజులకుగాను 7హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కింపు చేపట్టగా రూ.4,92,883ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ తెలిపారు. శ్రీకాకుళం దేవదాయ శాఖాధికారి జీవీబీఎస్ రవికుమార్, స్థానిక ఆంధ్రా బ్యాంకు సిబ్బంది పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి తదితరులు పాల్గొన్నారు.

10న శ్రీముఖలింగం దేవాలయ భూముల వేలం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం దేవాలయ భూములు సాగు(కౌలు)వేలం ఈ నెల పదో తేదీన కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నామని ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. శ్రీముఖలింగం దేవాలయ పరిధి 29.99 ఎకరాలకు గానూ 2024–2027 మూడేళ్ల సాగు చేసేందుకు ప్రథమ ధరావత్తు కింద రూ.30 వేలు చెల్లించాలన్నారు. అలాగే రూ.ఒక లక్షకు సాల్వెన్సీ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. అలాగే ఆలయ పరిధిలోగల రాధాగోవిందస్వామి మఠం భూములు 58.22 ఎకరాలకు కౌలు వేలం ఈ నెల 11న నిర్వహించనున్నామని, ఈ వ్యవసాయ భూములు కూడా మూడేళ్ల కాలపరిమితికి వేలం వేస్తామన్నారు. దీనికి ధరావత్తు రూ.25 వేలు చెల్లించాలన్నారు. పాటలో కౌలు హక్కు పొందిన రైతు ఒక ఏడాది నగదు ముందుగా చెల్లించి సాగు చేసుకునేందుకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఆలయ ఈఓను కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కేబుల్ వైర్లు దగ్ధం



కేబుల్ వైర్లు కాలి చెలరేగుతున్న మంటలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని కిమ్స్ ఆస్పత్రి సమీపంలోని భైరివానిపేట కూడలి వద్ద కేబుల్ వైర్లు కాలి చిన్నపాటి అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక శాఖ అధికారులు చెప్పిన వివరాల మేరకు.. భైరివానిపేట కూడలిలో ఉన్న విద్యుత్ స్తంభానికి జియో ఫైబర్ నెట్ కేబుళ్లు చుట్టి ఉంచారు. అనుకోకుండా కింద ఎర్త్ అవ్వడంతో పైన కేబుల్ వైర్లకు మంటలు అంటుకున్నాయి. అప్పటికే అగ్నిమాపక సిబ్బంది చేరి మంటలను అదుపు చేశారు. నష్టం పెద్దగా ఏమీ లేదని ఫైర్ విభాగం కానిస్టేబుల్ షణ్ముఖ తెలిపారు.

షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదం



పర్లాకిమిడి రాజవీధిలో బరాటం షాపింగ్ మాల్



మంటలను ఆపుతున్న అగ్నిమాపక దళం

పర్లాకిమిడి: స్థానిక రాజవీధిలోని బరాటం షాపింగ్ మాల్‌లో ఆదివారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో గ్రౌండ్, ఫస్టు ఫ్లోర్‌లో వస్త్రాలు, చీరలు, రెడీమేడ్ దుస్తులు కాలి బూడిదయ్యాయి. షాపింగ్ మాల్ మూసివేసిన తర్వాత షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరిగినట్లు మాల్ అధినేత బరాటం శ్రీకాంత్ అనుమానిస్తున్నారు. ప్రమాదంలో కోట్లాది రూపాయులు విలువ చేసే సరుకు కాలి బూడిదయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక దళం సిబ్బంది సంఘటన స్థలానికి విచ్చేసి మంటలను అదుపు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



షాపింగ్ మాల్‌లో కాలిపోయిన రెడీమేడ్ దుస్తులు



అగ్నిప్రమాదంతో మసిబారిన రెడీమేడ్ దుస్తులు



గ్రౌండ్ ఫ్లోర్‌లో కాలిపోయిన లిఫ్టు

ముందస్తు అనుమతి తప్పనిసరి

● డీజీపీ అరుణ్ కుమార్ షడంగి

భువనేశ్వర్: జంట ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ఒడిశా పోలీసులు విజయోత్సవాలకు ముందస్తు అనుమతి తీసుకోవడాన్ని తప్పనిసరి చేసినట్లు ప్రకటించారు. సోమవారం మీడియాతో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) అరుణ్ కుమార్ షడంగి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా ప్రతి కౌంటింగ్ కేంద్రంలో గట్టి భద్రతను అమలు చేశామన్నారు. ఈ విషయంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాలను ఖచ్చితంగా పాటిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 69 ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఒక్కో కంపెనీ చొప్పున, సమస్యాత్మక ప్రాంతాల్లో 2 కంపెనీల చొప్పున కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. ఈ లెక్కన ఒక్కో కౌంటింగ్ కేంద్రానికి ఒకటి నుంచి రెండు కంపెనీల రాష్ట్ర సాయుధ పోలీసులను కూడా మొహరించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం భద్రతను సంబంధిత జిల్లా ఎస్పీ తమ సొంత వనరులతో పర్యవేక్షిస్తారని తెలిపారు. ఏ పార్టీ అయినా, అభ్యర్థి అయినా విజయోత్సవ యాత్రకు వెళ్లాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, బాణసంచా వినియోగానికి అనుమతి తప్పనిసరి అన్నారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులతో కలెక్టర్ మహాజన్

రాయగడ:

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి జిల్లా గౌరవాన్ని పెంపొందించిన 10 మంది విద్యార్థులకు జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అభినందించారు. సోమవారం నాడు ఆయన కార్యాలయంలో ఈ మేరకు ఉత్తమ విద్యార్థులకు పుష్ప గుచ్ఛాలతో పాటు జ్ఞాపికలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో మరిన్ని మెట్లు అధిగమించాలని ఆకాంక్షించారు. ఉజ్వలమైన భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని అన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి బసంత కుమార్ నాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ సాగు.. భూమికి బాగు



సేంద్రియ ఎరువులతో దాలయ్య పండించిన ముల్లంగి పంట



సేంద్రియ ఎరువులకు అవసరమైన నీలామృతం తయారు చేస్తున్న సిబ్బంది

- రసాయనాల జోలికి వెళ్లకుండా ఎరువుల తయారీ
- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- ఆహార పంటల సామర్థ్యం పెంపు

ఇచ్ఛాపురం రూరల్: భూమికి సారం.. పంటకు బలం.. రైతుకు ఆదాయం.. అందరి ఆకాంక్ష ఇదే. ఈ దిశగానే రైతు సాధికార సంస్థ జిల్లా స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తోంది. సేంద్రియ వ్యవసాయం పేరిట ప్రకృతికి అనుగుణంగా వ్యవసాయం చేయాలంటూ విస్తృత ప్రచారం చేస్తోంది. ప్రకృతిని కాపాడుతూ జీవ వైవిధ్యాన్ని పెంపొందింపజేయడం, పంటలు, పశు పోషణను సమన్వయం చేయడం, తక్కువ పెట్టుబడితో వ్యవసాయ పద్ధతులను అమలు చేసి లాభాలు పొందేందుకు దోహదపడటం ఈ సంస్థ ప్రధాన ఉద్దేశం. మూస ధోరణిలో చేస్తున్న వ్యవసాయానికి స్వస్తి పలికి, రసాయనాల జోలికి వెళ్లకుండా సహజ సిద్ధమైన సేంద్రియ విధానంలో పంటలు పండిస్తూ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నట్లు రైతు సాధికార సంస్థ సభ్యులు చెబుతున్నారు. ఆవుపేడ, వేపాకు, ఆవు మూత్రం, జామ, సీతాఫలం, కానుగ, వావిలాకు, పొగాకు, మట్టి వంటి వాటిని సేకరించి నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, ఆజ్ఞాస్త్రం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వంటి ఎరువులు తయారు చేస్తున్నారు.

ఆదర్శంగా దాలయ్య సాగు..

ఇచ్ఛాపురం మండలం పాయితారి గ్రామానికి చెందిన సప్పట దాలయ్య తనకున్న ఎకరం పొలంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, వరి పంటను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఐసీఆర్పీ కుమారీ సూచనల మేరకు ఇరవై సెంట్లలో ఏటీఎం మోడల్‌గా 365 రోజులూ కూరగాయలు పండిస్తున్నాడు. ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా వరి పంట కూడా సాగు చేస్తున్నాడు.

లాభదాయకంగా కూరగాయల సాగు..

ప్రస్తుతం యూరియా, పురుగు మందులు వంటి ధరలు పెరగడంతో పాటు వాతావరణం అనుకూలించకపోవడంతో గత కొంత కాలంగా పంటలు పండించకుండా ఉండిపోయానని, ప్రకృతి వ్యవసాయం మూలంగా మళ్లీ పంటలు పండించడం మొదలు పెట్టానని మహిళా రైతు లోపింటి సరస్వతి చెబుతున్నారు. రైతు సాధికార సంస్థకు చెందిన సిబ్బంది ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించడంతో సేంద్రియ ఎరువుల తయారుచేసుకుని రెండేళ్లుగా పది రకాల కూరగాయలు పండిస్తూ లాభాలు పొందుతున్నట్లు చెబుతోంది.

సేంద్రియ పద్ధతిలో వరి..

తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో కేవలం సేంద్రియ ఎరువులను మాత్రమే ఉపయోగించి వరి పంటను పండిస్తుంటానని పాయితారికి చెందిన వలపల రమణ చెబుతున్నాడు. ప్రకృతి వ్యవసాయంపై అధికారులు శిక్షణ ఇవ్వడంతో తన పంట పొలాన్నే వ్యవసాయ క్షేత్రంగా మార్చి ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, బ్రహ్మాస్త్రం వంటి సేంద్రియ ఎరువులను సొంతంగా తయారు చేసుకొని ఏడాదికి రెండుసార్లు వరి పంట పండిస్తున్నానని చెప్పారు.

అధిక దిగుబడులు..



సేంద్రియ ఎరువులను రైతులు విరివిగా వాడుకోవచ్చు. పెట్టుబడి ఖర్చు తగ్గి సాధారణం కంటే సుమారు 10 నుంచి 15 శాతం ఆరోగ్యకరమైన పంట దిగుబడి పెరుగుతోంది. 18 నుంచి 32 రకాల నవధాన్యాలను ప్రత్యేకంగా తయారు చేసి ఎరువుల కిట్టుగా కిలో నామమాత్రం ధర కేవలం రూ.70కే రైతులకు విక్రయిస్తున్నాం. ఇవి అన్ని రైతు భరోసా కేంద్రాలకు అవసరం మేరకు సరఫరా చేస్తున్నాం. మా సిబ్బంది వద్ద కూడా లభిస్తున్నాయి.

– మద్దిలి చిట్టిబాబు, యూనిట్ ఇన్‌చార్జి, ప్రకృతి వ్యవసాయం

రైతులకు అవగాహన..



జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఐసీఆర్పీలుగా పనిచేస్తున్నాం. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు గ్రామాల్లో లభించే వనరులతో సేంద్రియ ఎరువులను తయారు చేసే విధానంపై శిక్షణ ఇస్తున్నాం. వీటి ద్వారా పంట ఆరోగ్యకరంగా ఉండటంతో పాటు 15 శాతం దిగుబడి పెరుగుతుంది. పంట పెట్టుబడి భారం తగ్గుతుంది.

– కందాల కుమారీ, ఐసీఆర్పీ, ప్రకృతి వ్యవసాయం

ఎస్పీ నితీష్‌తో అమ్లాన్ తల్లిదండ్రులు భేటీ

మల్కన్‌గిరి:

జిల్లాలోని కలిమెల సమితి ఆరోగ్య కేంద్రం వైద్యుడు అమ్లాన్ బోయి శనివారం రాత్రి కనిపించకపోవడం తెలిసిందే. దీంతో అమ్లాన్ తల్లిదండ్రులు ఓభనీ బోయి, రాధమణి బోయిలు జిల్లా ఎస్పీ నితీష్ వాద్వానీని సోమవారం కలిశారు. ఎస్పీ నితీష్ వాద్వానీ మాట్లాడుతూ తమ దర్యాప్తులో అమ్లాన్‌ను మావోలు మాత్రం కిడ్నాప్ చేయలేదని తెలిసిందన్నారు. దీనిపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.



ఎస్పీ కార్యలాయం వద్ద అమ్లాన్ తల్లిదండ్రులు

‘స్టార్టప్‌లపై దృష్టి సారించాలి’

టెక్కలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న స్టార్టప్‌లపై విద్యార్థులు దృష్టి సారించే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని హైదరాబాద్‌కు చెందిన టెక్నాలజీ డెవలపర్ అండ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మెంటార్ మనోజ్‌కుమార్ కోరారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఐఐసీ విభాగం ఆధ్వర్యంలో ‘డిజైన్ థింకింగ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్’ అనే అంశంపై సుమారు 5 రోజులు పాటు నిర్వహించనున్న అధ్యాపకుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టార్టప్‌లకు అవసరమైన పూర్తి స్థాయి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు సరైన ఆలోచనలను అందజేసే విధంగా శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ తరగతులను అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేవలం సర్టిఫికెట్ కోసం కాకుండా విద్యార్థులకు సరైన భవిష్యత్‌ను అందజేసే విధంగా శిక్షణ పొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏఎస్ శ్రీనివాసరావు, ఐఐసీ ఇన్‌చార్జి జి.సతీష్‌కుమార్ తో పాటు అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



అధ్యాపకుల శిక్షణలో మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

రోడ్డుపై కూలిన భారీ చెట్టు

పాతపట్నం: పాతపట్నం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి ఉరుములతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులు వీయడంతో మండలంలోని బూరగాం, కాపుగోపాలపురం, పాతపట్నం టీచర్స్ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు డంపింగ్ యార్డు వద్ద భారీ మర్రి చెట్టు ఆర్‌అండ్‌రోడ్డు మీద పడడంతో సోమవారం రాకపోకలు నిలిచిపోయాయి. పాతపట్నం, పలాస ఆర్టీసీ బస్సులు, మెళియాపుట్టి వెళ్లే వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్‌అండ్‌బీ రోడ్డు మీద భారీ మర్రి చెట్టు పడడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్‌అండ్‌బీ అధికారులకు స్థానికులు ఫోన్ చేసినా పట్టించుకోలేదు. దీంతో పాతపట్నం, తిడ్డిమి గ్రామ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, రోడ్డు మీద ఉన్న చెట్టను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



పాతపట్నం-మెళియాపుట్టి మధ్య రోడ్డుమీద పడిన భారీ మర్రిచెట్టు

గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని అయోధ్యపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతి చెందాయి. టెక్కలి గొల్లవీధికి చెందిన కూస పెంటయ్య అనే పాడి రైతు తన గేదెలను మేతకు తీసుకువెళ్లి తిరిగి ఆదివారం రాత్రి వస్తుండగా ఒక్కసారిగా వర్షం పడటంతో మంద నుంచి మూడు గేదెలు తప్పిపోయి సమీప జాతీయ రహదారిపైకి వెళ్లిపోయాయి. అయితే తప్పిపోయిన మూడు గేదెలను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మూడు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. అయితే వాటి విలువ సుమారు రూ.1.50లక్షలు వరకు ఉంటుందని రైతు చెబుతున్నారు.

ఫ్లాట్ నంబర్ 101లో మృతదేహం



మృతుడు గంధం రమేష్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కుళ్లిన మృతదేహం కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. రెండు రోజుల ముందే ఫ్లాట్ లోపల ఉన్న వ్యక్తి చనిపోయి సోమవారం బయటకు దుర్వాసన రావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికులు, రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని నెహ్రూవీధి బాలాజీ రెసిడెన్సీలోని 101 ఫ్లాట్‌లో గత కొంతకాలంగా గంధం రమేష్ (48) ఒంటరిగా నివసిస్తున్నాడు. ఇతనికి భార్య అశ్విని, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రమేష్ బంగారం పని చేస్తూ బతుకుతున్నాడు. 14 నెలల క్రితం రమేష్‌తో మనస్పర్థలు వచ్చి ఇంటిలో చెప్పకుండా భార్య అశ్విని వెళ్లిపోయింది. దీనిపై రమేష్ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాడు. భార్య వెళ్లిపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన రమేష్ మద్యానికి బానిసయ్యాడు. పిల్లలు ముగ్గురిని ఒడిశా రాష్ట్రం గారబందలో ఉంటున్న అమ్మమ్మ సుగుణ సంరక్షణలో ఉంచాడు.

దుర్వాసన రావడంతో..

గత బుధవారం పెద్ద కుమార్తె రజస్వల ఫంక్షన్ కోసం గారబంద వెళ్లిన రమేష్ శనివారం తిరిగి వచ్చేశాడు. అదే రోజు రాత్రి పూటుగా మద్యం సేవించి ఫ్లాట్‌లో పడుకున్నాడు. సోమవారం ఉదయం రమేష్ నివసిస్తున్న ఫ్లాట్ చుట్టుపక్కల తీవ్రంగా దుర్వాసన రావడంతో అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న దేవరాపల్లి శ్రీనివాసరావుకు అనుమానం వచ్చి రమేష్ ఇంటి తలుపులు కొట్టారు. ఎప్పటికీ తలుపులు తీయకపోవడంతో నగరంలోనే మొండేటి వీధిలో నివసిస్తున్న రమేష్ సోదరి రాజమహేంద్రం చిన్నారికి సమాచారం అందించారు. ఆమె వెంటనే వచ్చి తలుపులు బద్దలుగొట్టించి లోపలికి వెళ్లి చూస్తే రమేష్ టవల్ కట్టుకుని అచేతనంగా పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు విషయం చెప్పగా.. ఎస్‌ఐ హరికృష్ణ, క్లూస్‌టీమ్ ఘటనాస్థలికి చేరి వివరాలు, ఆధారాలు సేకరించారు. భార్య దూరంగా ఉండటంతో మద్యానికి బానిసై అదే మత్తులో చనిపోయి ఉంటాడనే కోణంలోనే కాక స్థానికుల నుంచి అనేక అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించినట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరికృష్ణ పేర్కొన్నారు.

మహాత్మా మన్నించు..



మందస మండలం నల్లబొడ్లూరు గ్రామంలో గాంధీ విగ్రహానికి తాళ్లు, విద్యుత్ తీగలు

కాశీబుగ్గ: మందస మండలం నల్లబొడ్లూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి విద్యుత్ తీగలు, తాళ్లను చుట్టి అవమానపరుస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో ఎవరి పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితి ఇలా మారింది. అధికారులు స్పందించి పరిస్థితి సరిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

కందిరీగల దాడిలో 12 మందికి గాయాలు



హరిపురం సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



కందిరీగల దాడిలో తీవ్ర గాయాలపాలైన దశమయ్య

సోంపేట: మండలంలోని మామిడిపల్లి పంచాయతీ పరిధిలో 12 మంది ఉపాధి హామీ వేతనదారులపై కందిరీగలు సోమవారం దాడి చేశాయి. తోటి వేతనదారులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కార్జి చెరువులో ఉపాధి పనులు సోమవారం ప్రారంభించారు. జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభిస్తుండగా తుప్పల్లో ఉన్న కందిరీగల పట్టు కదిలింది. దీంతో ఒక్కసారి గ్రూపులో 12 మందిపై కందిరీగలు దాడి చేశాయి. దాడిలో కోరిబిల్లి దశమయ్యకు తీవ్రగాయాలు కాగా, కోరిబిల్లి దాలమ్మ, కొర్ల హేమావతి, ఎం.కామేశ్వరి, గేదెల తులసమ్మ, నక్క రెయ్యిమ్మ, పాతిన పార్వతి తదితరులు 12 మందికి గాయాలయ్యాయి. వీరందరినీ స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణరావు హుటాహుటిన హరిపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. దశమయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో పలాస ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సాయంత్రానికి అందరూ కోలుకోవడంతో గ్రామస్తులు, ఉపాధి వేతనదారులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపీటీసీ దున్న మాదవరావు, గ్రామస్తులు పాతిన రామారావు, సొర్ర రామారావు పాతిన నాని తదితరులు బాధితులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు


టెక్కలి రూరల్: మండలంలోని రావివలస గ్రామ సమీప రహదారిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి తీవ్రగాయాలతో పడి ఉండటంతో స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు స్థానికులు, వైద్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. గాయపడిన వ్యక్తి టెక్కలి నుంచి మద్యం సీసాలు కొనుగోలు చేసి తన నడుము వద్ద ఉంచు కుని తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వా హనం ఢీకొనడంతోనో లేక అదుపు తప్పి పడిపోవడం వల్లనో కింద పడిపోయాడు. దీంతో నడుము వద్ద ఉన్న మద్యం సీసాలు పగలడంతో నడుము కింద భాగంలో తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు క్షతగాత్రుడిని గుర్తించి అతడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.



తీవ్రగాయాలతో గుర్తు తెలియని వ్యక్తి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి



గవిడి కృష్ణారావు (ఫైల్)

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలం శివరాం పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు గవిడి కృష్ణారావు (62) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈయన శ్రీకాకుళం నుంచి చీపురుపల్లి వైపు హైవేలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్ది సేపటి తర్వాత అటుగా వస్తున్న వారు చూసి మృతుడి సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన కోడలు విజయ సర్పంచ్‌గా ఉన్నారు. ఈయన మృతి పట్ల ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

కోనేరులో పడి వ్యక్తి మృతి



వెంకటరావు మృతదేహం

వేపాడ: మండల కేంద్రంలోని మంచినీటి కోనేరులో ప్రమాదవశాత్తూ పడి ఒకరు మృతి చెందారు. ఏఎస్సై బీవీ రమణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వల్లంపూడి గ్రామానికి చెందిన తమడాన వెంకటరావు (40) వేపాడలోని తన అక్క ఇంటి వద్ద ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసి బయటకు వెళ్లాడు. రాత్రయిన ఇంటికి చేరలేదు. సోమవారం మధ్యాహ్నం మంచినీటి కోనేరులో వెంకటరావు మృతదేహం కనిపించడంతో స్థానికులు గుర్తించి మృతుడి అక్కకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె సంఘటనా స్థలానికి చేరుకుని తమ్ముడి మృతదేహం చూసి కన్నీరు మున్నీరైంది. మృతుడి భార్య ఇందు కొట్యాడలోని కన్నవారి ఇంటి వద్ద ఉంటూ ఇద్దరు పిల్లలను చదివించుకుంటోంది. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలాజీ రెసిడెన్సీలో మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్ లో కుళ్లిన మృతదేహం కనిపించడం స్థానికంగా కల కలం రేపింది. రెండు రో జుల ముందే ఫ్లాట్ లోపల ఉన్న వ్యక్తి చనిపోయి సోమవారం బయటకు దుర్వాసన రావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికులు, రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని నెహ్రూవీధి బాలాజీ రెసిడెన్సీలోని 101 ఫ్లాట్‌లో గత కొంతకాలంగా గంధం రమేష్ (48) ఒంటరిగా నివసిస్తున్నాడు. ఇతనికి భార్య అశ్విని, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రమేష్ బంగారం పని చేస్తూ బతుకుతున్నాడు. 14 నెలల క్రితం రమేష్‌తో మనస్పర్థలు వచ్చి ఇంటిలో చెప్పకుండా భార్య అశ్విని వెళ్లిపోయింది. దీనిపై రమేష్ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాడు. భార్య వెళ్లిపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన రమేష్ మద్యానికి బానిసయ్యాడు. పిల్లలు ముగ్గురిని ఒడిశా రాష్ట్రం గారబందలో ఉంటున్న అమ్మమ్మ సుగుణ సంరక్షణలో ఉంచాడు.

దుర్వాసన రావడంతో..

గత బుధవారం పెద్ద కుమార్తె రజస్వల ఫంక్షన్ కోసం గారబంద వెళ్లిన రమేష్ శనివారం తిరిగి వచ్చేశాడు. అదే రోజు రాత్రి పూటుగా మద్యం సేవించి ఫ్లాట్‌లో పడుకున్నాడు. సోమవారం ఉదయం రమేష్ నివసిస్తున్న ఫ్లాట్ చుట్టుపక్కల తీవ్రంగా దుర్వాసన రావడంతో అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న దేవరాపల్లి శ్రీనివాసరావుకు అనుమానం వచ్చి రమేష్ ఇంటి తలుపులు కొట్టారు. ఎప్పటికీ తలుపులు తీయకపోవడంతో నగరంలోనే మొండేటి వీధిలో నివసిస్తున్న రమేష్ సోదరి రాజమహేంద్రం చిన్నారికి సమాచారం అందించారు. ఆమె వెంటనే వచ్చి తలుపులు బద్దలుగొట్టించి లోపలికి వెళ్లి చూస్తే రమేష్ టవల్ కట్టుకుని అచేతనంగా పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు విషయం చెప్పగా.. ఎస్ఐ హరికృష్ణ, క్లూస్‌టీమ్ ఘటనాస్థలికి చేరి వివరాలు, ఆధారాలు సేకరించారు. భార్య దూరంగా ఉండటంతో మద్యానికి బానిసై అదే మత్తులో చనిపోయి ఉంటాడనే కోణంలోనే కాక స్థానికుల నుంచి అనేక అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించినట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ పేర్కొన్నారు.

పోలిపల్లి పైడితల్లి హుండీల ఆదాయం రూ.3.86 లక్షలు

రాజాం సిటీ: బొబ్బిలి రోడ్డులో వెలసిన పోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయం సోమవారం లెక్కించారు. ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో లెక్కింపు ప్రక్రియ సాగింది. 74 రోజులకు రూ.3,86,768లు సమకూరిందని ఈఓ బి.వి. మాధవరావు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్, దేవదాయశాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవులు

- రిఫరల్ రోగులకు అండగా నిలుస్తున్న 108 సిబ్బంది
- కేజీహెచ్‌కు వెళ్లడానికి గతంలో ప్రైవేట్ అంబులెన్స్‌లే దిక్కు
- ప్రస్తుతం 108 అంబులెన్స్ ద్వారా ఉచితంగా తరలింపు
- మూడేళ్లలో 39,307 మందిని తరలించారు



108 అంబులెన్స్

విజయనగరం ఫోర్ట్: గంట్యాడ మండలానికి చెందిన పి. సింహాచలం అనే వృద్ధురాలు ఆయాసం, దగ్గు రావడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరింది. అక్కడ ఒక రోజు చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా మారడంతో వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. ఫోన్ చేసిన క్షణాల్లో 108 అంబులెన్స్ వచ్చి వృద్ధురాలిని కేజీహెచ్‌కు తరలించింది.

☛ మెంటాడ మండలానికి చెందిన ఆర్.పాపమ్మ అనే వృద్ధురాలికి జ్వరం, ఫిట్స్ రావడంతో సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. ఇక్కడ చికిత్స అందించిన తర్వాత పరిస్థితి మెరుగుపడకపోవడంతో వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. సిబ్బంది వచ్చి ఆమెను కేజీహెచ్‌కు తరలించారు.

వీరిద్దరే కాదు నిత్యం అధిక సంఖ్యలో రోగులను 108 సిబ్బంది రిఫరల్ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. గతంలో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులు కేజీహెచ్‌కు వెళ్లాలంటే ప్రైవేట్ అంబులెన్స్‌లో వెళ్లేవారు. గతంలో 108 అంబులెన్స్‌లు జిల్లాకే పరిమితమయ్యేవి. ప్రైవేట్ అంబులెన్స్‌ల్లో రోగులను విశాఖకు తరలించడానికి ఒక్కొక్కరి నుంచి రూ. 4 వేల నుంచి ఐదు వేల రూపాయల వరకు వసూలు చేసేవారు. ప్రస్తుతం జిల్లాలో 108 అంబులెన్స్‌లు 28 ఉన్నాయి. వీటిలో ఒకటి నవజాత శిశువులను తరలించే నియోనేటల్ అంబులెన్స్. పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీకి గాని, సీహెచ్‌సీ నుంచి జిల్లా ఆస్పత్రికిగాని , జిల్లా ఆస్పత్రి నుంచి విశాఖ పట్నం కేజీహెచ్‌కు రోగులను 108 ద్వారా తరలిస్తున్నారు.

2021 సంవత్సరం నుంచి 2023 వరకు 108 అంబులెన్సుల ద్వారా తరలించిన రోగులు	
సంవత్సరం	ఆస్పత్రికి తరలించిన రోగుల సంఖ్య
2021	12,112
2022	13,454
2023	13,741

1500 కిలోమీటర్ల వరకు ప్రయాణం..

అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను తరలించడానికి 108 అంబులెన్స్‌లు సుదూర ప్రాంతం ప్రయాణిస్తున్నాయి. జిల్లాలో 1500 నుంచి 1600 కిలోమీటర్ల వరకు రిఫరల్స్ ఆస్పత్రులకు ప్రయాణించి రోగులను తరలిస్తున్నారు.

తగ్గిన ఆర్థికభారం..

జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత రోగుల ప్రాణాలను కాపాడాలనే ఉద్దేశంతో రిఫరల్ ఆస్పత్రులు ఎంత దూరంలో ఉన్నా 108 అంబులెన్స్‌లో తరలిస్తున్నారు. దీనివల్ల చాలామంది రోగులు ప్రాణాలతో బయటపడుతున్నారు. రోగులు, క్షతగాత్రులను 108 వాహనాల ద్వారా ఉచితంగా తరలించడం వల్ల రోగులకు వేలాది రూపాయల ఆర్థిక భారం తగ్గుతోంది.



అంబులెన్స్‌లో రోగిని తరలిస్తున్న సిబ్బంది

ప్రాణాలు కాపాడడమే లక్ష్యం..



రోగుల ప్రాణాలు కాపాడాలన్న లక్ష్యంతో రిఫరల్ ఆస్పత్రులు సుదూరంగా ఉన్నప్పటికీ తరలిస్తున్నాం. ఫోన్ వచ్చిన క్షణాల్లో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని రోగులను ఆస్పత్రికి తరలిస్తూ, ప్రాణాలు కాపాడుతున్నారు.

– నజీర్ హుస్సేన్, 108 జిల్లా మేనేజర్

క్షణాల్లో వాలిపోతున్న 108..

ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే 108 అంబులెన్స్‌లు కుయ్ కుయ్ అంటూ సంఘటనా స్థలానికి చేరుకుంటున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అయితే 15 నిమిషాల్లోను, పల్లె ప్రాంతాల్లో అయితే 20 నుంచి 25 నిమిషాల్లో 108 అంబులెన్సులు సంఘటన స్థలానికి చేరుకుని రోగులు, క్షతగాత్రులకు అండగా నిలుస్తున్నాయి.

పైడితల్లి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి చదురుగుడి హుండీల ఆదాయం సోమవారం అమ్మవారి కల్యాణ మంటపం ఆవరణలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు మాట్లాడుతూ.. హుండీల ద్వారా 31 రోజులకు గానూ రూ. 12 లక్షల 31 వేల 170 నగదు, 26 గ్రాముల 800 మిల్లీగ్రాముల బంగారం, 285 గ్రాముల వెండి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, కెనరా బ్యాంక్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రామతీర్థానికి శ్రీకాకుళం యువకుల పాదయాత్ర



సీతారామస్వామి సన్నిధిలో పాదయాత్రగా వచ్చిన యువకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానానికి శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలువురు భక్తులు సోమవారం పాదయాత్రగా వచ్చారు. హనుమాన్ జయంతిను పురస్కరించుకుని లావేరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన 13 మంది యువకులు కాషాయ జెండాలు చేతపట్టి సుమారు 40 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు.

ఈ సందర్భంగా సీతారామస్వామిని భక్తి,శ్రద్ధలతో దర్శించుకున్నారు. ప్రతి ఏటా పాదయాత్రగా వచ్చి స్వామివారిని దర్శించుకుంటామని యువకులు తెలిపారు.

కందిరీగల దాడిలో 12 మందికి గాయాలు



హరిపురం సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



కందిరీగల దాడిలో తీవ్ర గాయాలపాలైన దశమయ్య

సోంపేట: మండలంలోని మామిడిపల్లి పంచాయతీ పరిధిలో 12 మంది ఉపాధి హామీ వేతనదారులపై కందిరీగలు సోమవారం దాడి చేశాయి. తోటి వేతనదారులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కార్జి చెరువులో ఉపాధి పనులు సోమవారం ప్రారంభించారు. జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభిస్తుండగా తుప్పల్లో ఉన్న కందిరీగల పట్టు కదిలింది. దీంతో ఒక్కసారి గ్రూపులో 12 మందిపై కందిరీగలు దాడి చేశాయి. దాడిలో కోరిబిల్లి దశమయ్యకు తీవ్రగాయాలు కాగా, కోరిబిల్లి దాలమ్మ, కొర్ల హేమావతి, ఎం.కామేశ్వరి, గేదెల తులసమ్మ, నక్క రెయ్యమ్మ, పాతిన పార్వతి తదితరులు 12 మందికి గాయాలయ్యాయి. వీరందరినీ స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణరావు హుటాహుటిన హరిపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. దశమయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో పలాస ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సాయంత్రానికి అందరూ కోలుకోవడంతో గ్రామస్తులు, ఉపాధి వేతనదారులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపీటీసీ దున్న మాదవరావు, గ్రామస్తులు పాతిన రామారావు, సొర్ర రామారావు పాతిన నాని తదితరులు బాధితులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

భామిని: మండలంలోని దిమ్మిడిజోల వద్ద ఏబీ రోడ్డుపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఏబీ రోడ్డుపై నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా బయలుదేరగా.. అదే సమయంలో రోడ్డు దాటుతున్న వృద్ధుడు తవుడును ఢీకొట్టింది. వెంటనే స్థానికులు స్పందించి 108 వాహనంలో వృద్ధుడిని కొత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తవుడును పాలకొండ ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

● ప్రాణాలు తీసిన పిడుగు..



అంతవరకు కిలకిలారావాలతో సందడి చేశాయి.. చిన్న చిన్న చినుకులతో వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో తోటి స్నేహితులతో ఊసులాడాయి.. ఇంతలో జరగరాని ఘోరం జరిగిపోయింది.. ఆదివారం రాత్రి ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో చిన్న ప్రాణాలు విలవిల్లాడుతూ కన్నుమూశాయి.. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో పిడుగు పడడంతో పదుల సంఖ్యలో పక్షులు మృత్యువాత పడ్డాయి. సుమారు 65 చిలుకలు, 40 కాకులు, 5 గెద్దలు, మరికొన్ని పిట్టలు కన్నుమూశాయి. పోలీస్ సిబ్బంది పక్షుల కళేబరాలను సోమవారం ఏరివేసి వట్టిగెడ్డ సమీపంలో ఖననం చేశారు.

– వీరఘట్టం

బాలికల భవితకు భరోసా..



బూసాయవలస కేజీబీవీ

రామభద్రపురం: బాలికల్లో అక్షరాస్యతా శాతం పెంచాలనే ఉద్దేశంతో దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ఏర్పాటు చేసిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ) నిరుపేద, అనాథ బాలికల ఉజ్వల భవితకు బాటలు వేస్తున్నాయి. పేద బాలికలకు పైసా ఖర్చు లేకుండా వసతితో కూడిన నాణ్యమైన విద్యా బోధనను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. దీంతో కేజీబీవీల్లో ప్రవేశాలకు డిమాండ్ ఏర్పడుతోంది. కేజీబీవీల్లో పాఠశాలలతో పాటు కళాశాలలు కూడా నిర్వహిస్తున్నారు. వీటిల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధన చేపడుతున్నారు. విశాలమైన భవనాలు, అన్నిరకాల సదుపాయాలు కల్పించడం, అద్భుతమైన ఫలితాలు రావడంతో కేజీబీవీల్లో చేరేందుకు బాలికలు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలో 26 కేజీబీవీలు ఉండగా 6వ తరగతిలో 1040 సీట్లు, ఇంటర్మీడియట్‌లో 1040 సీట్లు ఏటా భర్తీ చేస్తున్నారు. ఈ సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తుండగా.. ఈ ఏడాది ఆరో తరగతిలో ప్రవేశాలకు 4,085 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నారు. తల్లిదండ్రులు లేని వారికి, చదువు మధ్యలో ఆపేసిన వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆ తర్వాత మిగిలిన వారికి రూల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ప్రకారం మొదటి విడతలో 974 మందికి సీట్లు కేటాయించారు. మిగిలిన వారికి రెండో విడతలో సీట్లు కేటాయించనున్నారు.

ఇంటర్మీడియట్‌లో...

ఇంటర్మీడియట్ మొదటి ఏడాది వివిధ గ్రూపులకు 1040 సీట్లు ఉండగా వీటిలో ప్రవేశాల కోసం 2300 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో మొదటి విడతలో 535 మందికి సీట్లు కేటాయించగా.. మిగిలిన సీట్లు రెండో విడతలో భర్తీ చేయనున్నారు.

కేజీబీవీ కళాశాలల్లో గ్రూపుల వివరాలు..

జిల్లాలో 26 కేజీబీవీ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఒక్కో జూనియర్ కళాశాలలో ఒక్కొక్క గ్రూప్ మాత్రమే ఏర్పాటు చేసింది. దీంతో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి మొత్తంగా 2620 మంది విద్యార్థినులు చదివేందుకు అవకాశం ఉంది. అయితే కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో కేజీబీవీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు కూడా అవకాశం కల్పిస్తున్నారు. బాడంగి, చీపురుపల్లి, గజపతినగరం, గరివిడి, మెంటాడ, కొత్తవలస, ఎల్.కోట, నెల్లిమర్ల కళాశాలల్లో ఎంపీసీ గ్రూపులు నిర్వహిస్తున్నారు. అలాగే రామభద్రపురం, భోగాపురం, బొండపల్లి, పూసపాటిరేగ, రాజాం, తెర్లాం, వంగర, విజయనగరం, గంట్యాడలో గల కళాశాలల్లో బైపీసీ గ్రూపులు నిర్వహిస్తున్నారు. సంతకవిటిలో సీఈసీ, ఆర్ ఆమదాలవలస, వేపాడలో కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ ఎడ్యుకేషన్ (సీఎస్ఈ).. బొబ్బిలి, డెంకాడ, జామి కళాశాలల్లో ఎంపీహెచ్ డబ్ల్యూ.. గుర్ల కళాశాలలో ఫిజియోథెరపీ.. దత్తిరేజేరు కేజీబీవీ కళాశాలలో ప్రైమరీ స్కూల్ టీచర్ ట్రైనింగ్ గ్రూపులు నిర్వహిస్తున్నారు.

అన్ని రకాల సదుపాయాలు..

సమగ్ర శిక్షాభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేజీబీవీ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే బాలికలకు ఇంగ్లిష్ మీడియంలో కార్పొరేట్ విద్యా బోధనతో పాటు పలు సౌకర్యాలు ఉచితంగా అందిస్తున్నారు. విద్యార్థినులు ఉండేందుకు చక్కటి వసతి ప్రతీ విద్యాలయంలో ఉంది. ప్రభుత్వం నాడు – నేడు పథకం కింద అదనపు తరగతి గదులతో పాటు డార్మిటరీ, డిజిటల్ తరగతులు నిర్వహణకు ప్రత్యేక గది నిర్మించారు. చక్కటి పౌష్టికాహారంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్సులు, దుస్తులు, స్పోర్ట్స్ దుస్తులు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో ఎక్కువ శాతం మంది విద్యార్థినులు కేజీబీ విద్యాలయాల్లో చేరేందుకు ఆసక్తిచూపుతున్నారు.

ప్రవేశాలకు డిమాండ్..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మొదటి విడత అడ్మిషన్లు భర్తీ చేశాం. ఈ ఏడాది కేజీబీవీల్లో ప్రవేశాలకు డిమాండ్ ఎక్కువగా నెలకొంది. కేజీబీవీలు నాణ్యమైన విద్యకు ప్రతిరూపాలుగా మారాయి. అన్ని వసతులతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు ఇవి వరంగా మారాయి.

– ఎస్ ప్రేమ్‌కుమార్, డీఈఓ

నిబంధనల ప్రకారం

పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు



లెక్కింపు సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

- రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్:

విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ లెండీ ఇంజినీరింగ్ కళాశాలలో జరగనుందని, ఈ ప్రక్రియ మొత్తం సీసీటీవీల కవరేజ్, వీడియో గ్రఫీ చేస్తామని విజయనగరం పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి స్పష్టంచేశారు. రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు వారికి కేటాయించిన స్థానాల్లో కూర్చుని పరిశీలించాలే తప్ప, లెక్కింపునకు సంబంధించిన ఎలాంటి పనుల్లో పాల్గొనకూడదన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. లెక్కింపు పూర్తయ్యే వరకు సిబ్బంది ఎవ్వరూ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలాంటి సంభాషణలు జరపకూడదన్నారు. విరామానికి వెళ్లినా తిరిగి మాట్లాడకుండా రావాలని, ఎన్నికల కోడ్ 6వ తేదీ వరకు అమల్లో ఉంటుందన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కౌంటింగ్ కేంద్రాల వద్దకు తీసుకు రాకూడదన్నారు. ఏజెంట్లు కూర్చునే కుర్చీలపై జాతీయ, రాష్ట్రస్థాయి గుర్తింపు పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులకు చెందిన ఏజెంట్లకు ప్రతి టేబుల్ వద్ద వరుస క్రమంలో సీటింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. వారికి కేటాయించిన సీట్లలోనే కూర్చోవాలన్నారు. కౌంటింగ్ హాల్ వద్దకు వచ్చే ప్రతిఒక్కరికీ ఫొటో ఐడెండీటీ తప్పనిసరన్నారు. ప్రతి ఒక్కరూ సమయానికి హాజరై వారికి కేటాయించిన టేబుల్ వద్ద 7 గంటలకే అందుబాటులో ఉండాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో ఓటువేసిన వారి వివరాలు బయటకు వెల్లడి కాకుండా చూడాల్సిన బాధ్యత కౌంటింగ్ సిబ్బందిపై ఉందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి గెజిటెడ్ సంతకం ఉంటే సరిపోతుందని, పేరు, డిజిగ్నేషన్ అవసరం లేదని, ఈటీపీబీఎస్‌పై తప్పనిసరిగా డిజిగ్నేషన్, స్టాంప్ ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు వేగంగా, కచ్చితంగా నిబంధనల ప్రకారం ఆలస్యం కాకుండా జరగాలన్నారు. సమావేశంలో ఏఆర్‌ఓ సుమబాల, మెప్మా పీడీ సుధాకర్, పోస్టల్ బ్యాలెట్ ఇన్‌చార్జి సందీప్ తదితరులు పాల్గొన్నారు.